సాక్షి జగిత్యాల

బుధవారం। 29। జనవరి। 2025



పూల'బత్తి'

వివిధ ఆలయాల్లో పూజకు వినియోగించిన పుష్పాలతో అగరుబత్తీలు తయారు చేసే సరికొత్త ఒరవడికి జైళ్ల శాఖ శ్రీకారం చుట్టింది.

-8లో▸



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారి ని దర్శించుకున్నారు.

-8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/18.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం, రాత్రి సమయంలో చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరి



కుమ్మరిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈఈ

రాయికల్: రైతులు తమ వ్యవసాయ మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చుకోవాలని డీఈఈ రాజిరెడ్డి అన్నారు. మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ప్రారంభించారు. రైతుల సౌలభ్యం కోసం ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని, విద్యుత్ సమస్యలు ఎదురైతే 1912 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ సింధూర్‌శర్మ, ఏఈ నవీన్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు భూమయ్య, రైతు సంఘం నాయకులు బుచ్చిరాజం, బొల్లె రాధ, శేఖర్, అనంతయ్య, కాంతయ్య, ఇంద్రాల రాజేశ్, భూమరాజం పాల్గొన్నారు.

రాయికల్‌లో కార్గో సేవలు ప్రారంభం



కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న రామారావు

రాయికల్: రాయికల్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో కార్గో లాజిస్టిక్ కౌంటర్‌ను కరీంనగర్ రీజియన్ కార్గో లాజిస్టిక్స్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ సమయంలో వివిధ వస్తువులను వేగవంతంగా పంపించేందుకు కార్గో సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. రాయికల్ పట్టణ, మండల ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయికల్ ఏజెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంతో రైతులకు ఉపాధి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ లక్ష్మీమనోహర్

జగిత్యాలరూరల్: పాడి పశువుల పెంపకంతో రైతులకు ఉపాధి దొరుకుతుందని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి లక్ష్మీమనోహర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పాడి పశువులకు సమీకృత ఆహారం అందించడం ద్వారా అధిక పాల దిగుబడి పొందవచ్చన్నారు. దూడల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాడి గేదెలకు ఖనిజ, లవణ మిశ్రమం, విటమిన్ మిశ్రమం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి నరేశ్‌రెడ్డి, సిబ్బంది నాగేందర్, రవీందర్, వీఏ రమేశ్, సిబ్బంది బక్కయ్య, పోచయ్య, అహ్మద్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: తెలంగాణ పాటల గొంతుక, ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బీరం రాజేశ్ మాట్లాడుతూ సంజయ్ వెంటనే తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు విజయవంతం

జగిత్యాల: వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు విజయవంతం అయ్యాయని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. మొత్తం 424 కొనుగోలు కేంద్రాల ద్వారా 68,543 మంది రైతుల నుంచి 3,08,270 టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఇందులో 2,77,177 టన్నుల దొడ్డు రకం, 31,092 టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులకు మద్దతు ధరగా గ్రేడ్ ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చొప్పున చెల్లించామని, రైతులకు రూ.715 కోట్లు వారివారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు.

సబ్బుల్లేవు.. దుస్తులు ఇవ్వరు

- బల్దియా పారిశుధ్య కార్మికుల ఇక్కట్లు
- ఉత్త చేతులతోనే చెత్త తొలగింపు
- అనారోగ్యం పాలవుతున్న కార్మికులు



చేతులకు గ్లౌజులు లేకుండానే చెత్తను సేకరిస్తున్న బల్దియా పారిశుధ్య కార్మికులు

జగిత్యాల: పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులదే కీలక పాత్ర. ప్రతిరోజు వారు చెత్త తీయకున్నా.. డ్రెయినేజీలు శుభ్రం చేయకున్నా దుర్గంధం వెదజల్లుతుంది. మున్సిపల్ పాలకవర్గం ఉన్న సమయంలో కేవలం పది మంది కార్మికులకు సబ్బులు, నూనెలు, బట్టలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. వాస్తవానికి కార్మికులందరికీ అన్నిరకాల వస్తువులు ఇవ్వాలి. కానీ.. ఇప్పటివరకు ఏ ఒక్కరికీ ఇవ్వలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం పాలకవర్గం ముగిసి ప్రత్యేధికారుల పాలన వచ్చింది. కనీసం ఇప్పుడైనా కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, బట్టలు, ఆర్పన్స్ ఇస్తారా.. అన్నది సంశయంగా మారింది. ఇప్పటికీ కార్మికులపై నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ఉన్నన్ని రోజులు పాలకవర్గం పట్టించుకోకపోవడం, అధికారులు సైతం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దుస్తులు, ఇతరత్రా వస్తువులు అందించకపోవడంతో వట్టి చేతులతోనే చెత్తను తరలిస్తున్న కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. తీవ్ర దుర్గంధంలో పనిచేస్తూ ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారు.

దుస్తుల పంపిణీలో అవకతవకలు

పారిశుధ్య కార్మికులకు ఏటా దుస్తులు, సబ్బులు, నూనెలు, చెప్పులు, ఆర్పన్స్ ఇతరత్రా వస్తువులు అందించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ బట్టలు ఇస్తే కార్మికులే కుట్టించుకుంటారు. కుట్టుకూలీ కింద రూ.300 అందిస్తారు. గతంలో ఉన్న పాలకవర్గమో.. అధికారులో తెలియదు కానీ ఓ కాంట్రాక్టర్‌కు బట్టలు కుట్టే బాధ్యతను అప్పగించారు. అయితే వారు ఒక జతకు కుట్టుకూలీ రూ.800వేశారు. కార్మికులు అంతమొత్తం ఇవ్వకపోవడంతో అవి అతడి వద్దనే ఉండిపోయాయి. అప్పటినుంచి కార్మికులకు దుస్తులే లేకుండా పోయాయి. అలాగే కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల మళ్లీ అతనితో బేరం కుదుర్చుకుని కొన్ని బట్టలను అతని నుంచి తీసుకున్నట్లు తెలిసింది.

కానరాని సబ్బులు, నూనె, చెప్పులు

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు, ఆర్పన్స్ చెప్పులు ఇచ్చేందుకు టెండర్లు పిలుస్తుంటారు. కానీ టెండర్ దక్కించుకున్న వారికి బిల్లులు ఇవ్వకపోవడంతో వారు అందించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్మికులు ఉత్త చేతులతోనే పూడిక తీయడంతోపాటు, పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. చెత్తాచెదారం తరలిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా తయారుచేస్తూ.. కార్మికుల మాత్రం అనారోగ్యం పాలవుతున్నారు.

గాడితప్పుతున్న శానిటేషన్

జగిత్యాల బల్దియాలో శానిటేషన్ పూర్తిగా గాడితప్పుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికులకు కావాల్సిన వస్తువులను సరఫరా చేయకపోవడంతో పాటు వాహనాల మరమ్మతుకు అధిక బిల్లులు వేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఆరు వాహనాలు ఇప్పటికే కరీంనగర్‌లోనే మరమ్మతు పేరిట ఉన్నాయి. ఇలా శానిటేషన్ విభాగంలో ఏది చూసుకున్నా అవినీతి ఆరోపణలే అత్యధికంగా కన్పిస్తున్నాయి. గతంలో బ్లీచింగ్ పౌడర్ సైతం వాసన లేనివి ఇవ్వడంతో కౌన్సిలర్లు ఈ విషయం లేవనెత్తడంతో వెంటనే వాటిని వాపస్ పంపించారు. ప్రస్తుతం మళ్లీ ఆప్కో వారికి మున్సిపల్ వారికి సంబంధించిన దుస్తులు ఇచ్చారని, సబ్బులు, నూనెలు, ఆర్పన్స్, చెప్పులు, పరికరాలకు సంబంధించిన టెండర్లు జరిగాయని, త్వరలోనే వారికి అందిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

నాణ్యత లోపం..

కార్మికులకు అందించే పరికరాలు గతంలో టెండర్లు పిలువగా నాణ్యత లేనివి సరఫరా చేశారు. శానిటేషన్‌కు ఉపయోగించే తట్టలు, పారలు, గడ్డపారలు, కొడవళ్లను కొటేషన్‌లో టాటా కంపెనీకి సంబంధించినవి ఇచ్చి అనంతరం అవి కాకుండా ఏదో నామమాత్రపు కంపెనీకి చెందిన పరికరాలు ఇచ్చారు. దీంతో ఆ పరికరాలను కార్మికులు తిరస్కరించారు. ప్రస్తుతం అవి బల్దియాలోనే మూలనపడ్డాయి.

త్వరలోనే కార్మికులకు అందజేస్తాం



టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఆప్కో వారు త్వరలోనే కార్మికులకు దుస్తులు అందించనున్నారు. సబ్బులు, కొబ్బరి నూనె, ఆర్పన్స్, చెప్పులను వారం రోజుల్లో అందించేలా చర్యలు చేపడుతున్నాం. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

అట్టహాసంగా పోలీసు క్రీడాపోటీలు ప్రారంభం

- ఏడేళ్ల అనంతరం జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలు
- మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయం
- ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి
- ఉత్సాహంగా రాష్ట్ర 3వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్
- 20 జోన్ల నుంచి 2,380మంది క్రీడాకారులు హాజరు



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్/కరీంనగర్‌టౌన్: రాష్ట్ర 3వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలు కరీంనగర్‌లోని పరేడ్ మైదానంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీలు జరగడం ఆనందంగా ఉందన్నారు. ఆలిండియా పోలీస్ క్రీడోత్సవాల్లో తెలంగాణ జట్లు పతకాల పంట పండించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 2015లో ఆదిలాబాద్‌లో, 2017లో వరంగల్‌లో పోటీలు జరగ్గా.. ఇప్పుడు కరీంనగర్‌లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. పోటీల్లో సుమారు 2,380మంది క్రీడాకారులు పాల్గొనడం, అందులో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరం అన్నారు. పోటీలకు ఘనంగా ఏర్పాట్లు చేసిన పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతిని అభినందించారు. ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అంటేనే ఎంతో ఒత్తిడితో ఉండే ఉద్యోగం అని ఇలాంటి పోటీలతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఐజీ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా విభజన అనంతరం అట్టహాసంగా పోటీలు జరుగుతున్నాయన్నారు. అనంతరం క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్, గౌర వ వందనం స్వీకరించారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, ఇండియన్ నేషనల్ గేమ్స్ తరహాలో మార్చ్‌ఫాస్ట్ ఘనంగా సాగింది. రాష్ట్రంలోని 20 జోన్లకు చెందిన క్రీడాకారులు రంగురంగుల క్రీడాదుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలించారు. తొలుత కాళేశ్వరం జోన్ జట్టు మార్చ్‌ఫాస్ట్ చేయగా చివరగా ఆతిథ్య రాజన్న జోన్ జట్టు చేసింది. అనంతరం తెలంగాణ పోలీస్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ అధికారులు వసుంధర, మాధవి రూపొందించిన స్పోర్ట్స్ అంథమ్ సీడీని ఆవిష్కరించారు. కాళేశ్వరం, ఇంటెలిజెన్స్ జోన్ జట్ల మధ్య జరిగిన సాకర్ మ్యాచ్‌తో తొలిరోజు వేడుకలు ముగిశాయి. కరీంనగర్, రామగుండం సీపీలు అభిషేక్ మహంతి, శ్రీనివాసులు, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల ఎస్పీలు అఖిల్ మహాజన్, అశోక్ కుమార్, శిక్షణ ఐపీఎస్ వసుంధర యాదవ్, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్లలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్, పాల్గొన్న అధికారులు

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: హాస్టళ్లలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో మరమ్మతు కోసం కేటాయించిన నిధులను ఏ మేరకు వినియోగించారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, మెనూపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులకు ఇబ్బందులు రానీయొద్దన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, రాజ్‌కుమార్, సునీత, చిత్రు పాల్గొన్నారు.

మొక్కలు రక్షించాలి

వెల్గటూర్: నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్థానిక అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంతోపాటు చెగ్యాంలోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను పరిశీలించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల రకాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో అనిల్ ఉన్నారు.

బేటీ బచావో బేటీ పడావో విజయవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

జగిత్యాల: బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు అవుతున్న సందర్భంగా మార్చి 8 వరకు ఉత్సవాలు నిర్వహించాలన్నారు. సైకిల్ ర్యాలీ, బాలికల బైక్ ర్యాలీ, ప్రభాత్‌భేరి, మొక్కలు నాటే కార్యక్రమం తదితర కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి నరేశ్, వైద్యాధికారి ప్రమోద్, ఇంటర్మీడియెట్ అధికారి నారాయణ, ఎస్సీ అభివృద్ధి అధి కారి రాజ్‌కుమార్, ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ, చిత్రు, రాము తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు పాటించాలి

జగిత్యాల: స్కానింగ్ సెంటర్లలో వైద్యులు, సిబ్బంది నిబంధనలు పాటించాలని, ఫాం-ఎఫ్ ఆన్‌లైన్ పోర్టల్‌లో వచ్చేనెల ఐదో తేదీలోపు జిల్లా కార్యాలయంలో సమర్పించాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. మంగళవారం వైద్య కార్యాలయంలో జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రోపరియట్ అథారిటీ కమిటీతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో 78 స్కానింగ్ సెంటర్లు అనుమతి పొందాయని, ప్రతి సెంటర్‌పై నిఘా ఉంచాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ జైపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, గైనకాలజిస్ట్ విశ్వభారతి, పూర్ణచందర్, రామకృష్ణ, మంచాల కృష్ణ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

జగిత్యాల: ఈనెల 30 నుంచి వచ్చేనెల మూడో తేదీ వరకు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు గ్రిడ్ డివిజన్ ఇంజినీర్ శేఖర్ రెడ్డి తెలిపారు. కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో మిషన్ భగీరథ పైపుల మరమ్మతు సందర్భంగా నీటి సరఫరా ఉండదన్నారు. ధర్మపురి, వెల్గటూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, మల్లాపూర్ మండలాలను మినహాయించి మిగతా మండలాల్లో సరఫరా ఉండబోదని, ప్రజలు సహకరించాలని సూచించారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పొద్దు
- ఎట్టి పరిస్థితుల్లోనూ లింకులు ఓపెన్ చేయొద్దు
- గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బులు వెనక్కి తేవొచ్చు
- ప్రతిఒక్కరి వద్ద 1930 నంబరు ఉండాలి
- సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి
- 'సాక్షి ఫోన్ ఇన్'కు స్పందన

సాక్షి ఫోన్ ఇన్

జగిత్యాలక్రైం:జిల్లాలో నిత్యం పదుల సంఖ్యలో సైబర్ వలలో చిక్కుకుంటున్నారు. కొందరు ధైర్యం చేసి పోలీసుల దృష్టికి తీసుకెళ్తున్నారు. చాలామంది అవగాహన లేక ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి పాల్గొన్నారు. బాధితులు, ప్రజల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.



ప్రశ్న: బ్యాంకు నుంచి మాట్లాడుతున్నం. లోన్ మాఫీ అయ్యింది.. ఓటీపీ చెప్పమంటున్నారు.. చెప్పాలా వద్దా..?

– బోడుగం బాపురెడ్డి

డీఎస్పీ: గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సరే ఓటీపీ అడిగితే చెప్పవద్దు. ఓటీపీ చెప్పిన మరుక్షణం మీ సమాచారం అతడికి చేరుతుంది. బ్యాంకులో దాచుకున్న డబ్బులన్నీ కాజేస్తాడు.

ప్రశ్న: సైబర్ నేరాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

– నరేందర్‌రెడ్డి, గంగారెడ్డి, జగిత్యాల

డీఎస్పీ: సైబర్ నేరాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్‌ను నియమించాం. అతను నెలలో నాలుగుసార్లు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. మోసాల్లో నాన్ ఫైనాన్షియల్, ఫైనాన్షియల్ ఉంటాయి. వాటిని అరికట్టేందుకు అవగాహన కల్పిస్తున్నాం. మోసం చేసే నిందితులపై ఐటీ చీటింగ్ కేసులను నమోదు చేస్తున్నాం. ఆర్థిక నేరాలపై కఠిన శిక్షలు లేవు. సైబర్ మోసాలపై ప్రతిఒక్కరం అవగాహన కలిగి ఉండాలి.

ప్రశ్న: బిట్‌కాయిన్స్, ఆన్‌లైన్‌లో రూ.1.20లక్షలు పెడితే రూ.3లక్షలు వస్తాయంటున్నారు..?

– రాంరెడ్డి, ఆలూరు, రాయికల్

డీఎస్పీ: వీటిని మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు అంటారు. ఇలాంటి ఆఫర్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు. ఎక్కడో కూర్చున్న తెలియని వ్యక్తిని నమ్మించడమే సైబర్ మోసం. ఆన్‌లైన్ ట్రేడింగ్ కోసం కొంతమంది యూఎస్‌డీటీ కొని ట్రేడింగ్ చేసి కొన్ని బినామీల పేరుతో మోసాలకు పాల్పడతారు.

ప్రశ్న: మీ అబ్బాయి/అమ్మాయి డ్రగ్స్, రేప్, ఇతర క్రైంలో ఇరుక్కున్నారని ఫోన్లు వస్తున్నాయి. తమ ఖాతాకు డబ్బు పంపిస్తే కేసు మాఫీ చేస్తామంటున్నారు..?

– లక్ష్మీనారాయణ, తిప్పన్నపేట

డీఎస్పీ: ఇవి ఆన్‌ప్ ప్రైవేట్ ఫైనాన్స్ చేసే మోసాలు. మీకు తెలిసిన వ్యక్తి ఆన్‌లైన్‌లో రుణం తీసుకుని ఉంటాడు. అతడికి వచ్చే మెసేజ్‌లోని లింక్‌ను ఓపెన్ చేస్తే అతడి ఫోన్ హ్యాక్ చేసి అందులో ఉన్న కాంటాక్ట్ నంబర్లకు ఇలాంటి బెదిరింపు కాల్స్ చేసి డబ్బులు లాగుతారు. అలాంటి ఫోన్ కాల్స్‌కు భయపడొద్దు. వేధింపులు ఎక్కువైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. లేదా సైబర్ క్రైం ఫ్రాడింగ్ కాల్స్ వాట్సాప్ నంబరు 87126 72222కు మెసేజ్ చేస్తే బ్లాక్ చేస్తాం.

ప్రశ్న: గతేడాది నవంబర్ 9న ఆన్‌లైన్‌లో రూ.60 వేలు పోగొట్టుకున్న. డబ్బులు తిరిగి వస్తాయా?

– సత్యప్రభు, రాయికల్

డీఎస్పీ: ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైల్స్‌పై క్లిక్ చేయడంతో మీ డబ్బులు పోయి ఉంటాయి. వెంటనే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేసి ఉంటే డబ్బులు వచ్చేవి. ఒక్కరోజు ఆలస్యంగా స్పందించినా డబ్బులు వచ్చే అవకాశం తక్కువ. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తాం. నిందితుడు దేశంలో ఎక్కడ పట్టుబడినా డబ్బులు వచ్చే అవకాశం ఉంది. మీ డబ్బు ఏ ఖాతాలోకి వెళ్లిందో త్వరలోనే గుర్తిస్తాం.

ప్రశ్న: ఫొటోలు మార్ఫింగ్ చేసి బెదిరిస్తున్నారు. ఏం చేయమంటారు?

– నిఖిల్, మెట్‌పల్లి

డీఎస్పీ: మీకు ఏ ఫోన్ నంబరు నుంచి ఫొటోలు పంపిస్తున్నారో ఆ నంబరును 87126 72222కు వాట్సాప్ పంపండి. వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేయిస్తాం. మీరు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి నిందితులను గుర్తించి చర్యలు చేపడతాం.

5వేల కుటుంబాలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

జగిత్యాల: ఐదు వేల కుటుంబాలకు డబుల్‌బెడ్ రూంలు మంజూరు కాగా.. దాదాపు 20 వేల మందికి లబ్ధి చేకూరిందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పొన్నాల గార్డెన్స్‌లో 202 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.2.2 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. పట్టణంలో 18 వేల ఇళ్లకు ఉచిత కరెంట్ పథకం అమలుతోపాటు, రూ.5 కోట్లతో టీఆర్‌నగర్‌లో ఏటీసీ అడ్వాన్స్‌డ్ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలకు గతంలో రూ.10 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని, త్వరలోనే పూర్తిస్థాయి నిధులు మంజూరవుతాయని తెలిపారు. నూకపల్లి అర్బన్ కాలనీని మున్సిపాలిటీలో కలుపుతామన్నారు. రూ.5 కోట్లతో మహిళా డిగ్రీ కళాశాల నిర్మిస్తామన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, తహసీల్దార్ రాంమోహన్, గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రభుత్వం మోసం

- కవిత చొరవతోనే రాయికల్ అభివృద్ధి
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్: సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావడం కోసం ఆరు పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది అయినప్పటికీ వాటి ఊసే లేదని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలం లోపు పథకాలు అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి హామీలు నెరవేర్చలేదని, జనవరి 26కి రైతు భరోసా ఇస్తామని రైతులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని చెబుతున్నా.. ఎక్కడ అభివృద్ధి జరిగిందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హయాంలోనే రాయికల్ బల్దియాకు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధుల ద్వారానే దేవాలయాలు, సీసీరోడ్లు, మున్సిపల్ భవనం వంటి పనులు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎనగందుల ఉదయశ్రీ, మారంపల్లి రాణి, మాజీ కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, శ్రీరాముల సువర్ణ, నాయకులు బాబా, నేరటి శ్రీనివాస్, దొంతి నాగరాజు పాల్గొన్నారు.



రాయికల్‌లో కేసీఆర్, కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దావ వసంత

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


వరలక్ష్మి- ఆద్విక్

గోదావరిఖని: స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన తోట వరలక్ష్మి తన కుమారుడు తోట ఆద్విక్‌తో కలిసి ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపోయిందని పోలీసులు మంగళవారం తెలిపారు. ఇంట్లో గొడవ కావడంతో తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి బయకు వెళ్లిపోయిందన్నారు. ఆచూకీ తెలిసిన వారు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ-1 నంబరు 87126 56516, సీఐ-2 నంబరు 87126 56517కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని, లేదా డయల్ 100 నంబరుకు ఫోన్ చేయాలని పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు 28 నుంచి 30 సంవత్సరాలలోపు ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ ప్రదీప్‌కుమార్ సూచించారు.

బీఫార్మసీ విద్యార్థిని మృతి

హుజూరాబాద్/వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని నయీంనగర్‌లోని వాగ్దేవి బీఫార్మసీ కళాశాలలో చదువుతున్న సాయిచంద్రిక ఫ్యాన్‌కు ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ వైసతీశ్ తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌కు చెందిన బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న సాయి చంద్రిక (20) ఈనెల 26న హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకోగా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మెరుగైనా చికిత్స కోసం ఈనెల 27న కరీంనగర్‌కు తరలిస్తుండగా చనిపోయినట్లు తెలిపారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

భూ తగాదా కేసులో ఐదేళ్ల జైలు

ఇబ్రహీంపట్నం: భూతగాదాలతో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు ఐదేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పుచెప్పారు. సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామానికి చెందిన సల్వాల రాజేందర్ వ్యవసాయం చేసుకుని జీవిస్తాడు. అదే గ్రామానికి చెందిన చిన్న లక్ష్మయ్య అలియాస్ లస్మయ్య మధ్య భూ హద్దుల విషయంలో గొడవలు జరిగాయి. 2017 సెప్టెంబర్ 2న రాజేందర్ పొలం పనులు చేసుకుంటుండగా చిన్న లక్ష్మయ్య గొడ్డలితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రామునాయక్ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసులు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అప్పటి ఎస్సై రాము, కోర్టు కానిస్టేబల్ కవితను ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు అభినందించినట్లు సీఐ తెలిపారు.

- ఆలయాల్లో పూజకు వినియోగించిన పుష్పాలతో అగరుబత్తులు
- కరీంనగర్ జిల్లా జైలులో తయారీ
- మొదట ప్రయోగాత్మకంగా ఇక్కడే ప్రారంభం
- టీటీడీ తరహాలో జైళ్లశాఖ సరికొత్త ఒరవడి

పూల 'బత్తి'


కలెక్టర్ పమేలా సత్పతికి అగరుబత్తుల ప్యాకెట్‌ను అందిస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా(ఫైల్)

కరీంనగర్‌క్రైం: వివిధ ఆలయాల్లో పూజకు వినియోగించిన పుష్పాలతో అగరుబత్తీలు తయారు చేసే సరికొత్త ఒరవడికి జైళ్ల శాఖ శ్రీకారం చుట్టింది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో వాడిన పూలతో అగరబత్తులు తయారు చేయాలని జైళ్ల శాఖ సంకల్పించింది. మొదట ప్రయోగాత్మకంగా కరీంనగర్ జిల్లా జైలులో ప్రారంభించారు. ఇప్పటికే విద్యాసంస్థలకు బెంచీలు, డెస్కులు, షాంపులు, సబ్బులు, ఫినాయిల్, ఇంట్లో ఉపయోగపడే వస్తు సామగ్రి, తదితర వస్తువులను జైళ్ల శాఖ ఖైదీలతో తయారు చేయిస్తుంది. కరీంనగర్‌తో పాటు అన్ని జైళ్లలో వస్తువుల తయారీతో పాటు పెట్రోల్‌బంక్‌లు నిర్వహిస్తూ ఖైదీలకు ఉపాధి చూపించడంతో పాటు ఆదాయం సమకూర్చుకుంటుంది. మార్కెట్‌లో లభించే వస్తువులతో పోల్చితే తక్కువ ధర ఉండడం, నాణ్యత పాటించడంతో జైళ్లలో తయారైన వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది.

రసాయనాలు లేకుండా..

జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులలో రసాయనాలు వాడకుండా సహజసిద్ధంగా తయారు చేస్తుండడంతో చాలా మంది వాడుతున్నారు. అగరుబత్తులు కూడా రసాయనాలు, ఇతరత్రా ఏమీ కలపకుండా ఆలయాల్లో పూజకు వినియోగించిన పూలను సేకరించి వాటితో తయారు చేస్తున్నారు. వాడిన పూలను ఎండబెట్టి, పొడి చేసి వాటితో సహజమైన పదార్థాలు కలిపి అగరబత్తులు తయారు చేస్తున్నారు. ఆలయాల నుంచి పూల సేకరణకు దేవాదాయశాఖ నుంచి అనుమతి తీసుకోనున్నట్లు తెలిసింది. ఇటీవల కరీంనగర్ జైలు సందర్శనకు వచ్చిన జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా అగరుబత్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ పమేలా సత్పతికి జైలులో తయారైన అగరుబత్తులు అందజేశారు. వీటిని మార్కెట్‌లో ప్రవేశపెట్టడంతో పాటు ఇతర జైళ్లలోనూ అగరుబత్తుల తయారీ కేంద్రాలు ప్రారంభిస్తామని, వీటికి మంచి డిమాండ్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్యాకెట్ ధర రూ.50..

జైలులో తయారు చేస్తున్న అగరుబత్తుల తయారీకి వాడిన పూలు, ఇతర పదార్థాలు వాడుతున్నారు. అత్తుక్కోవడానికి యారయార పౌడర్, మండడానికి రాళం పొడి(కర్పూరం పొడి), చెక్కపొడి, పూలను ఎండబెటి పొడర్ కలుపుతున్నారు. ఖైదీలతో మ్యాన్యువల్ మిషన్ ద్వారా రోజుకు 2,500 నుంచి 3,000 వరకు అగరుబత్తులు తయారు చేయిస్తున్నారు. భవిష్యత్‌లో ఆర్డర్లు పెరిగితే ఆటోమేషన్ మిషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని జైళ్ల శాఖ భావిస్తుంది. జైలుతో తయారు చేసే ప్యాకెట్‌లో 65 నుంచి 70 అగరుబత్తులు ఉంటుండగా, ప్యాకెట్ ధర రూ.50 ఉంటుంది.


ఖైదీలు తయారు చేసిన అగరుబత్తులు

సహజసిద్ధంగా..



రాష్ట్రంలోనే మొదటగా కరీంనగర్ జైలులో వాడిన పూలతో అగరుబత్తులు తయారీ జరుగుతుంది. స్థానిక ఆలయాల్లో పూజలకు ఉపయోగించిన వాడిపోయిన పూలను సేకరించి ఎండబెట్టి, సహజ సిద్ధమైన పదార్థాలు కలుపుతూ అగర్‌బత్తులు తయారు చేస్తుండడంతో ఆదరణ లభిస్తుంది.

– శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలు

- అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయుల ప్రచారం
- జిల్లాలో తొమ్మిది పాఠశాలలు


కరీంనగర్‌లో అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్న మైనార్టీ గురుకుల ఉపాధ్యాయులు

కరీంనగర్/కరీంనగర్‌రూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 18నుంచి ప్రారంభమైంది. వచ్చేనెల 28వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఆయా గురుకులాల్లో అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 9 మైనార్టీ గురుకుల పాఠశాలలున్నాయి. వీటిలో ఐదు బాలుర, నాలుగు బాలికల పాఠశాలలున్నాయి. కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని విట్స్ కళాశాల ప్రాంగణంలో బాలుర గురుకుల పాఠశాల-1, ఇరుకుల్లలో బాలు ర పాఠశాల-2, మొగ్దుంపూర్‌లో బాలుర పాఠశాల-3, కరీంనగర్‌లోని గణేష్‌నగర్‌లో బాలికల పాఠశాల-2, రేకుర్తిలో బాలికల పాఠశాల-1,జమ్మికుంటలో బాలికల పాఠశాల, హుజురాబాద్‌లో బాలుర పాఠశాల,చొప్పదండిలో బాలికల పాఠశాల, మానకొండూరులో బాలుర పాఠశాలలున్నాయి. మైనా ర్టీలతోపాటు బీసీ, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గురుకులాల్లో ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతితోపాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సులు, 6,7,8 తరగతుల్లో మైనార్టీ మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వీలుంది.

రిజర్వేషన్లు ఇలా...

గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం రిజర్వేషన్ విధానం అమలు చేస్తున్నారు. ఒక్కో గురుకుల పాఠశాలలో మొత్తం 80 సీట్లు ఉంటాయి. దీనిలో 75 శాతం మైనార్టీలు, 25శాతం నాన్ మైనార్టీలకు ప్రవేశం కల్పించారు. మైనార్టీ కోటాలో ముస్లింలకు 64శాతం, క్రిస్టియన్లు 7శాతం, జైన, పార్సీ, బౌద్ధ,సిక్కులకు కలిపి 4శాతం సీట్లు కెటాయించారు. నాన్ మైనార్టీ కోటాలో ఎస్సీలకు 6శాతం, ఎస్టీ 4శాతం, బీసీ 12శాతం, ఓసీలకు 3శాతం సీట్లున్నాయి.

ఉపాధ్యాయుల ప్రచారం

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బొమ్మకల్ బైపాస్‌లోని విట్స్ ప్రాంగణంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల-1 చెందిన ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ వీర్ల మహేశ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ముస్లిం జనాభా ఉన్న ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మైనార్టీ గురుకులాల్లోని సౌకర్యాలను వివరిస్తు అడ్మిషన్లపై విస్తృత ప్రచారం చేపట్టాం. తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సురేశ్, ఆర్ఎల్‌సీ, కరీంనగర్

ఇంటికి చేరిన బాధితుడు


అంజిని ఇంటికి పంపిస్తున్న ఎన్నారై బైరదేవ్


సాక్షి

వేతనం ఇస్తలేరు.. అడిగితే కొడుతున్నరు

సాక్షిలో వచ్చిన కథనం

- సౌదీలో కొలనూర్‌వాసి నరకయాతన
- వెలుగులోకి తెచ్చిన 'సాక్షి' కథనం
- స్పందించి ఎంబసీకి లేఖ రాసిన విప్ శ్రీనివాస్

సాక్షి స్పందన

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి నిమిత్తం ఓ యువకుడు సౌదీ వెళ్లగా కంపెనీ యాజమాన్యం వేతనమివ్వక, అడిగితే కొట్టడంతో బాధితుడు తన గోడు వెల్లబోసుకున్నాడు. అతడి వ్యథను 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ప్రభుత్వ విప్ స్పందించి బాధితుడు ఇంటికి చేరేలా చర్యలు తీసుకోగా మంగళవారం చేరుకున్నాడు. వివరాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన మెరుగు అంజి ఏడాది క్రితం బతుకుదెరువు కోసం డ్రైవరు వీసాపై బొంబాయ్‌లోని విజయ్ గల్ఫ్ ఆఫీసులో రూ.లక్షన్నర చెల్లించి సౌదీ వెళ్లాడు. అక్కడ కంపెనీవారు ఐదు నెలల నుంచి జీతం ఇవ్వకుండా, పని చేయించుకుని సరైన సమయానికి అన్నం పెట్టకుండా పాస్‌పోర్టు లాక్కొని ఇబ్బందులు పెట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వకుండా అక్కడి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తనను కాపాడాలని బాధితుడు అంజి సీఎం రేవంత్‌రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్‌ను సోషల్ మీడియాలో వేడుకోగా, అతడి బాధను ×సాక్షి< 2024 ఆగస్టు 9న ప్రచురించింది. విప్ ఆది తక్షణమే స్పందించి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇండియన్ ఎంబసీ, సౌదీ అరేబియా దేశానికి లేఖ రాసి అధికారులతో మాట్లాడారు. అంజి ఆచూకీ తెలుసుకోవాలని సౌదీలో ఉన్న ఎన్నారై బైరదేవ్ యాదవ్‌ను కోరాడు. ఈనేపథ్యంలో అంజి ఆచూకీని బైరదేవ్‌యాదవ్ కనుక్కొని తన రూంలో ఐదు నెలలపాటు ఆశ్రయం కల్పించాడు. పాస్‌పోర్ట్ కంపెనీవారు ఇవ్వకపోవడంతో కొత్త పాస్‌పోర్ట్, వీసా టిక్కెట్ కొని ఏర్పాట్లు పూర్తవడంతో ఈనెల 27న బయలుదేరిన అంజి మంగళవారం ఇంటికి చేరాడు. ఈసందర్భంగా విప్ ఆది శ్రీనివాస్, ఐదు నెలలు ఆశ్రయం కల్పించిన బైరాదేవ్ యాదవ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రౌడీ షీటర్ జిల్లా బహిష్కరణ


మోయిజ్‌కు నోటీసు ఇస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: నేర ప్రవత్తిని మార్చుకోకుంటే జిల్లా బహిష్కరణ చే స్తామని పోలీస్ బాస్ వెల్లడించిన 72 గంటల్లోనే చర్యలు చేపట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన రౌడీ షీటర్ మోయిజ్‌పై జిల్లా బహిష్కరణ వేటు వేస్తూ టౌన్ సీఐ కృష్ణ మంగళవారం నోటీసులు జారీ చేశారు. మోయిజ్ జిల్లాలో ఎక్కడైనా కనపడితే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అతడిపై సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 కేసులు ఉన్నాయని, హత్య, హత్యాయత్నం, ఆయుధాల చట్టం, బెదిరింపులకు పాల్పడడం, యూట్యూబ్ చానల్ వేదికగా వ్యక్తిని విచక్షణారహితంగా కొట్టడం వంటి కేసుల్లో నిందుతునిగా ఉండి రౌడీషీటర్ ఉన్నా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో నోటీసు జారీ చేసినట్లు వివరించారు. ప్రజాశాంతికి, సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగిస్తున్నాడనే ఫిర్యాదుల మేరకు అతడిపై తెలంగాణ సామాజిక వ్యతిరేక, ప్రమాదకర కార్యక్రమ చట్టం 1980 ప్రకారం జిల్లా బహిష్కరణ నోటీస్ జారీ చేశామని వెల్లడిచంచారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టం.. అద్దెకు ఉంటున్న ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన యువకుడు, డబ్బుల కోసం అద్దెకు ఉంటున్న ఇంటికే కన్నం వేసిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగింది. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కాసోజి విజయ్ మండల కేంద్రంలోని బందారపు గంగిరెడ్డి ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. విజయ్ స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. డబ్బు కోసం ఎనిమిదేళ్లుగా అద్దెకు ఉంటున్న ఇంటిపైనే కన్నేశాడు. ఇటీవల ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లో దాచిన 4 తులాల బంగారం గొలుసు, అర తులం కమ్మలు, ఐదు గ్రాముల ఉంగరం, అర తులం చైన్ ఎత్తుకెళ్లాడు. బాధితుడు గంగిరెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ ఏరియాలో విజయ్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించగా, రిమాండ్‌కు తరలించారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కర్నాటకకు చెందిన ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ చింతన ప్రకాశన్ ఇటీవల నిర్వహించిన మ్యాథ్, సైన్స్, చిత్రలేఖనం ఒలింపియాడ్‌లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి వివిధ విషయాలతో పాటు ముఖ్యంగా గణితం, సైన్స్‌లోని విషయాలపై ప్రత్యేక దృష్టి సారించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో చిత్రలేఖనం ఒలింపియాడ్‌లో టి.భవిష్య (4వ తరగతి), ఎ.సమీక్ష, (8వ), మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో ఇ.సుహాస్ (7వ), జి.సాయి సంహిత (8వ), సైన్స్ ఒలింపియాడ్‌లో ఎన్.వినాయక్ (7వ)రాణించగా మరికొంతమంది విద్యార్థులు రాష్ట్ర, జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

మంత్రివర్యా.. మాటలు వెనక్కి తీసుకోండి

- కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం
- ఎంప్లాయీస్ జేఏసీ భాగస్వామ్య పక్షాల ధ్వజం


మాట్లాడుతున్న ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ కలెక్టర్‌తో మాట్లాడిన మాటలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో తమ మద్దతు ఉండదని జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ భాగస్వామ్య పక్షాలు స్పష్టం చేశాయి. జిల్లాలో దాదాపు 50 వేల మంది ఉద్యోగులున్నారని ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం టీఎన్జీవో, టీజీవో, పెన్షనర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, ట్రెజరీ, జెడ్పీ, పంచాయతీరాజ్, మహిళా జేఏసీ సంఘాలు ప్రకటన విడుదల చేశాయి. స్వార్థ రాజకీయాలకు అధికారులు, ఉద్యోగులను బలి చేయడం భావ్యం కాదన్నారు. రోజురోజుకు దిగజారుడు రాజకీయం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశాయి. రాజకీయాల్లోకి ఐఏఎస్, ఐపీఎస్‌లను లాగితే తామెంటో నిరూపించే రోజులొస్తాయని ప్రకటించారు. జిల్లాలో జరిగిన ఘటనల క్రమంలో రాష్ట్ర జేఏసీ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. కలెక్టర్ చేసిన తప్పేంటని, అన్ని రాజకీయపక్షాలను, ప్రజాప్రతినిధులను కలుపుకొని ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి అనుక్షణం పర్యవేక్షించడమే తప్పా అని ప్రశ్నించారు. అనాలోచితంగా సహనాన్ని కోల్పోయి కలెక్టర్‌పై అవాకులు, చవాకులు మాట్లాడటం, బాధ్యత గల పదవిలో ఉన్నవారికి తగదని హితవు పలికారు. సహనాన్ని పరీక్షించొద్దని, తాము తలుచుకుంటే ప్రజలతో మమేకమై ఏ ప్రజాప్రతినిధి ఏమి చేస్తున్నాడో సవివరంగా వివరించే శక్తి, సత్తా ఉందని గుర్తుంచుకోవాలని సూచించారు. టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, టీజీవో అధ్యక్షుడు మడిపల్లి కాళిచరణ్, కార్యదర్శి అరవింద్ రెడ్డి, నాగరాజు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమల్ల శారద తదితరులు ఉన్నారు.

నేరెళ్ల హత్య కేసులో మరో వ్యక్తి రిమాండ్


నిందితుడిని రిమాండుకు తరలిస్తున్న పోలీసులు

ధర్మపురి: ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో ఓ వ్యక్తిని హత్య చేసి.. కాల్చి చంపిన సంఘటనలో పోలీసులు గతంలో ఇద్దరిని అరెస్టు చేసిన విషయం తెల్సిందే. ఇదే ఘటనలో పాల్గొన్న మరో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కమలాపూర్‌కు చెందిన నేరెళ్ల గోపాల్, నేరెలకు చెందిన గండికోట శేఖర్ కలిసి 2024 డిసెంబర్ 12న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాహుల్ సూర్యప్రకాశ్‌సింగ్‌ను ముంబయి నుంచి కారులో నేరెల్లకు తీసుకొచ్చారు. డిసెంబర్ 13న సాంబశివ దేవాలయం వద్ద హత్య చేసి సారంగపూర్ మండలం బట్టపెల్లి, పోతారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి దహనం చేశారు. ఈ ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు గోపాల్, శేఖర్‌ను డిసెంబర్ 22న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో సంబంధమున్నట్లు అనుమానిస్తున్న మూడో వ్యక్తి మెరుగు లస్మయ్యను మంగళవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


రుణమాఫీ, రైతు భరోసా కోసం

రైతుల నిరాహార దీక్ష



భూషణరావుపేటలో నిరాహార దీక్షలో కూర్చున్న రైతులు

కథలాపూర్: రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణరావుపేటలో అన్నదాతలు మంగళవారం నిరాహారదీక్ష చేపట్టారు. ముందుగా ప్రభుత్వ పాఠశాల నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న మహాత్మగాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో అన్ని పార్టీల రైతులు కూర్చోవడం విశేషం. దీక్ష శిబిరం వద్దకు తహసీల్దార్ వినోద్, ఏవో యోగితా, ఎస్సై నవీన్‌కుమార్ చేరుకున్నారు. దీక్ష విరమించాలని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. దీనిపై రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే రైతుభరోసా మూడుసార్లు రావాల్సి ఉందని, ఇంకెప్పుడు ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. వారు కొద్దిసేపు నచ్చజెప్పడంతో దీక్ష విరమించారు. రైతు నాయకులు లోక శశిధర్‌రెడ్డి, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి, గడ్డం రాజారెడ్డి, కొండ ఆంజనేయులు, కొత్తపెల్లి శ్రీనివాస్, గడ్డం శేఖర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్, పుర్కుటపు నర్సారెడ్డి, తీట్ల శంకర్, రవినాయక్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఏఈఓ వైరాగ్యం అంజయ్య, అధికారులు అశోక్, హరిహరనాథ్, సునీల్ సిబ్బంది పర్యవేక్షించారు.



నమ్మించి రూ.60వేలు కాజేసిన సైబర్ మోసగాడు

వేములవాడఅర్బన్: సైబర్ మోసగాని చేతిలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు మోసపోయిన ఘటన సోమవారం జరగ్గా.. మంగళవారం వెలుగులోకి వచ్చింది. జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. వేములవాడ మండలం అగ్రహారంలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్న మహేశ్‌కు సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను డాక్టర్ రాజిరెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. తనకు ఆన్‌లైన్ ద్వారా (ఫోన్ పే లేదా గూగుల్ పే) డబ్బు పంపిస్తే కమీషన్ ఇస్తానని, తన మనిషి వచ్చి డబ్బులు ఇస్తాడని ఎర వేశాడు. ఇదే సైబర్ మోసగాడు వేములవాడ నందికమాన్ వద్ద ఉన్న ఓ బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు సురేశ్‌కు ఫోన్ చేసి తాను డిగ్రీ కళాశాల లెక్చరర్ రాజిరెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. తనకు 110 బిర్యాణీలు కావాలని తెలుపగా, సురేశ్ అడ్వాన్స్ డబ్బులు కావాలని అడిగాడు. అగ్రహారంలోని ఆన్‌లైన్ సెంటర్ వద్దకు వెళ్లి ఫోన్ చేస్తే డబ్బులు ఇస్తారని తెలిపాడు. సురేశ్ అక్కడికి వెళ్లి రాజిరెడ్డికి కాల్ చేసి ఆన్‌లైన్ సెంటర్ మహేశ్‌కు ఇచ్చా డు. రాజిరెడ్డి ఫోన్‌లో మహేశ్‌తో మాట్లాడుతూ తన కు రూ.65 వేలు ఆన్‌లైన్ ద్వారా పంపించాలని, సు రేశ్ డబ్బులు తీసుకువచ్చాడని నమ్మించాడు. దీంతో మహేశ్ రెండు నంబర్లకు ఫోన్ పే ద్వారా రూ. 65 వేలు పంపించాడు. అనంతరం సురేశ్‌ను మహే శ్ డబ్బులు అడిగాడు. కాగా తనకు బిర్యాని డబ్బులు రూ.5 వేలు అడ్వాన్స్ ఆన్‌లైన్ సెంటర్‌లో మహే శ్ ఇస్తాడని చెబితే ఇక్కడికి వచ్చానని సురేశ్ పేర్కొన్నాడు. వెంటనే బాధితులిద్దరూ సైబర్ మోసగాడు రాజిరెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి 1930కు ఫిర్యాదు చేశారు.

సౌదీలో రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు


రమేశ్ (ఫైల్)


జంగిటి శ్రీనివాస్


అరపెల్లి శ్రీధర్


సల్కం అంకిత్

మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: సౌదీ అరేబియాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధి కోసం వెళ్లిన పట్టణంలోని రేగుంటకు చెందిన కాపెల్లి రమేశ్ (30) మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండకు చెందిన మరో ముగ్గురు గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం రేగుంటకు చెందిన రమేశ్ మూడు నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడి జీజాన్‌లోని ఓ సప్లయ్ కంపెనీలో పనిచేస్తున్న 25 మంది ఎప్పటిలాగే మంగళవారం మినీ బస్సులో విధులకు బయల్దేరారు. ఎదురుగా వచ్చిన ట్రక్కు మినీ బస్సును ఢీకొనడంతో వివిధ దేశాలకు చెందిన 15 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో కాపెల్లి రమేశ్ కూడా ఉన్నారు. ఇదే సంఘటనలో వర్షకొండకు చెందిన జంగిటి శ్రీనివాస్ ఛాతిలో గాయం కావడంతో అక్కడ ఆసుపత్రికి తరలించారు. అరపల్లి శ్రీధర్ చేయి విరిగింది. సల్కం అంకిత్‌కు గాయాలు అయినట్లు కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. గాయపడిన వారు క్షేమంగా ఉన్నారని తెలియడంతో ఇక్కడి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి కోసం వెళ్లిన అతడు అంతలోనే మృత్యువాత పడడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.